సంజ వెలుగు

ఎప్పటిలాగే సూర్యుడు తూర్పు దిక్కున ఉదయించాడు. శశిరేఖ నిద్రలేచింది. సోఫావైపు చూసింది. కిటికీలోంచి రివ్వున వీచేగాలికి పేపరు టపటప కొట్టుకొంటోంది. శశిరేఖ మంచంమీదినుంచి లేచి సోఫాలో కూర్చుంది.

"రాజా"

"......"

"పేపరు వార్తలేమిటి రాజా ?"

"......"

ఒక క్షణం ఆగి శశిరేఖ గట్టిగా నవ్వింది.

"ఇది నిన్నటి పేపరు భలే !"

ఆ పేపరు లాగేసి, ఆరోజు పేపరు దాని స్థానే ఉంచింది శశిరేఖ.

"ఏదో ఒకటి. పేపరంటూ ఉంటేసరి కాదూ ?"

చిన్నగా నవ్విందామె. క్షణం నిశ్శబ్దం. ఆమె ముఖంలో హాసరేఖలు అదృశ్యమయాయి.

"రాజా !" దీనంగా పిలిచింది.

"......"

వంటమనిషి కాఫీ బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది.

"కాఫీ, రాజా"

"......"

"కాఫీ అక్కర్లేదా ?"

"____"

"అన్నట్లు, ఇవాళినించేకాబోలు కాఫీ మానెయ్యటం, అంతేనా ?"

"____"

"పలకవా రాజా ?"

'రాజా' పలకడు, ఉలకడు. ఆమె కళ్ళల్లో గిర్రున తిరిగిన కన్నీటిబిందువులు రెండు పేపరుమీదికి జారాయి. కొంతసేపటిదాకా ఆమె అలాగే ఉండిపోయింది. "కాఫీ చల్లారిపోతోందమ్మా" కప్పులు తీసుకు వెళ్ళటానికి వచ్చిన పనిమనిషి. కాఫీ సంగతి జ్ఞాపకం చేసింది. శశిరేఖ గబగబా కాఫీ త్రాగేసింది. పని మనిషి కప్పులు తీసుకు వెళ్ళిపోయింది.

"స్నానానికి టైమయింది రాజా"

"___ ___"

"లేవరా ?"

'రాజా' కదలడు, మెదలడు.

పనిమనిషి బకెట్‌లో నీళ్లు తెచ్చిపెట్టి వెళ్ళిపోయింది. శశిరేఖ నీళ్లలో తువ్వాలు ముంచి ముఖం కడిగింది. కొత్తషర్టు తొడిగింది.

కిటికీలోంచి లేత సూర్యకిరణాలు 'రాజా' మీద పడుతున్నాయి.

"ఇవాళ ఎంత బాగున్నావో అద్దంలో ఒకసారి చూసుకోండి"

'రాజా' కళ్ళెత్తాడు.

ఆమె 'రాజా' వైపు అలాగే చూసింది.

రాజా నోరు విప్పాడు.

కాసేపు నిశ్శబ్దం.

"మరి నేను వస్తా రాజా, డాక్టరుకి ఎంత పనుంటుందో మీకు చెప్పేదేముంది ?"

బరువుగా, దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి రాజా తల ఒకసారి నిమిరి చెమ్మగిలిన కళ్లు తుడుచుకొని, గది గడపదాటింది శశిరేఖ.

ఎప్పటిలాగే సూర్యుడు అస్తమించాడు. క్రమంగా చీకటి దట్టంగా వ్యాపించసాగింది. గడియారంలో గంటల ముల్లు తొమ్మిది మీదికి జరిగింది.

"ఇవాళ ఒక ఆపరేషన్ చాలా నేర్పుగా చేశాను రాజా. మొదట కొంచెం భయపడ్డాను. కాని జయప్రదంగా చేశాను. మీ రేఅయితే అసలు..." శశిరేఖ ఆగింది.

'రాజా' వైపు అర్ధనేత్రాలతో చూసింది.

రాజా మెప్పుకోలుకి సంతోషించాడు.

"అంతా మెచ్చుకున్నారు రాజా"

కాని రాజా మెచ్చుకోడు.

"ఎంత గొప్పడాక్టరైనా నా రాజా తరవాతే"

రాజా సంతోషించాడు.

"ఎప్పుడూ పేపరు చదువేనా?" కొంటెగా పేపరులాగి వెయ్య బోయింది.

రాజా అడ్డుపెట్టడు. "ఏమిటి కొంటె చేష్టలు?" అనడు.

"ఎప్పుడూ చదువుతుంటే కళ్లు పాడైపోతాయి".

రాజా కళ్ళుమూసింది ఆమె. కాని రాజా తన చల్లని చేతితో ఆమె చేతిని కళ్లకద్దుకోడు. ముద్దు పెట్టుకోడు. దుఃఖం ఆమె గుండె చీల్చుకొని బయటికివచ్చి నదీ ప్రవాహంలా ప్రవహించసాగింది. రాజా బుజంమీద తల ఆన్చి కన్నీటితో అభిషేకం చేసింది. అలా ఎంతసేపున్నా ఆమెకి టైం తెలియదు. ఏ రాత్రివేళో లేచి మంచంమీద పడుకుంటుంది మామూలే. రాజా ఆమెని ఓదార్చడు. ఓదార్చలేడు. మళ్లీ తెల్లవారుతుంది.

మళ్లీ రాజాని పలకరిస్తుంది; లాలిస్తుంది; హాస్యాలాడుతుంది; నవ్వుతుంది; కబుర్లు చెబుతుంది; పాడుతుంది. రాజా పెదవి మెదల్చడు; కళ్లొత్తి—దడు; చిరునవ్వు నవ్వడు. ఆమె ముఖంలో విషాదం అలముకుంటుంది; కన్నీళ్లు గిర్రున తిరుగుతుంది; విలపిస్తుంది. కాసేపు అదే అవస్థలో రాజా బుజంమీద తల ఆనించి ఏదో లోకంలో విహరిస్తుంది; ఏదో ప్రశాంతత మరికొంతసేపటికి ఆవరిస్తుంది. అదే అవస్థలో తనని తాను మర్చిపోతుంది. ఏ రాత్రి వేళో మెళకువ వస్తుంది. లేచి మంచంమీద పడుకుంటుంది. మళ్లీ తెల్లవారుతుంది.

౨

"డాక్టరుగారు చాలా మంచివారు"

తన తండ్రి జబ్బు నయంచేసిన డాక్టర్ రాజగోపాలరావుని గురించి శశిరేఖ ఆ మాటలంటే ఇంట్లో అంతా 'అవును' అని ఘంటాపథంగా వప్పుకున్నారు. కాని శశిరేఖకి మాత్రం తృప్తికలగలేదు. మళ్ళీ ఆ మాటలే అంది. 'నిజమే' అన్నారంతా. 'పాపం చాలా మంచివాడు' అంది శశిరేఖ మూడోసారి.

"అలాగా !" అన్నాడు ఆమె తండ్రి కొంచెం నవ్వి. అప్పట్లో ఆమెకి తెలియలేదు. ఆమాటల వెనకాలవున్న అర్థం. ఇంటర్మీడియట్ అయితే ప్యాసయింది. కాని ఆలోచనాశక్తి అంతగా అలవడలేదు అప్పటికి.

"అంత మంచి డాక్టర్ని నే నెక్కడా చూడలేదు" అంది.

"నువ్వుకూడా డాక్టర్ చదివితే అంతకంటె మంచిదానివవుతావు"

"ఎవరైనా ఆయన తరవాతే."

ఆమె తండ్రి చిన్ననవ్వునవ్వి ఊరుకున్నాడు.

"డాక్టర్ని మరీ అంత ఆకాశాని కెత్తాలిసిన అవసరమేమీ నాకు కన పడటంలేదు" అన్నాడు శశిరేఖ తమ్ముడు.

"ఏం ?"

"డాక్టరైనవాడు తనపని ఏదో చూసుకుపోవాలిగాని ఊరికే ఇంట్లో అందరి ముఖాలవైపూ తేరి పారచూడటమెందుకు ?"

శశిరేఖ గుండె గతుక్కుమంది. వీడు ఉన్నట్లుండి ఏదో అంటాడు వెధవ ! అయితే తనుకూడా అనుకుంది. నిజానికి చాలాసార్లు డాక్టర్ అప్పు డప్పుడు తనవైపు అలా చూడటం అంత బావుండలేదని. తమ్ముడి రిమార్కుని ఎవరూ లక్ష్యంచెయ్యలేదల్లే ఉంది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు కాసేపటి వరకూ.

"డాక్టరుకి పెళ్ళయిందా ?" అమ్మ అడిగింది. ఆవిడకి అనుమానాలు. ఇంతవరకు ఎవరికీ ఆ సందేహం కలగలేదు.

"ఏమో !"

ఆ సమాధానానికి శశిరేఖకి కొంచెం కోపం వచ్చింది. చుట్టుపక్కల ఉండేవాళ్ళని గురించి ఆమాత్రం తెలుసుకోరేం ?

"అయే ఉంటుంది" అన్నాడు తమ్ముడు. వాడివైపు ఆమె చురచుర చూసింది. అన్నీ తెలిసినట్లు మాట్లాడతాడు.

"ఆయన మంచితనానికితగ్గ మంచిభార్య దొరికితే అదృష్టవంతుడే" అన్నాడు దాన్నివైపు చూస్తూ అలా తనవైపు చూడటమెందుకు ?

"మన శశిరేఖలాంటి పిల్లయితే సుఖపడతాడు." అమ్మ అన్నది అమ్మకి తనమీద ఎంతో అభిమానం. ఆమెమీద తనకిగల ప్రేమ ఆ క్షణంలో ద్విగుణీ కృతమైంది.

ఆవిడ అన్నట్టు డాక్టర్ రాజగోపాలరావు శశిరేఖని పెళ్ళిచేసుకొని చాలా సుఖపడ్డాడు. కావాలంటే ఆమెని మెడిసిన్ చదవమన్నాడు అతను. కాని అందువల్ల అతనికి కలిగే ఇబ్బందుల్ని తలచుకుని శశిరేఖ ఆ మాట తల పెట్టటం మానుకుంది. రాజగోపాలరావు వ్యక్తిగతంగా చాలా నిర్లక్ష్యస్వభావం కలవాడు. అతనికి కావలిసిన ప్రతీదీ శశిరేఖ స్వయంగా సమకూర్చిపెట్టాలి. అలాంటి పరిస్థితిలో అన్నేళ్లు అతనిని విడిచిపెట్టి ఎలా ఉంటుంది?

జాలిగా అదే ప్రశ్న అడిగింది శశిరేఖ. రాజగోపాలరావు యుద్ధ ప్రదేశానికి డాక్టరుగా వెళ్ళటానికి నిశ్చయించుకున్నప్పుడు అతను నవ్వి అన్నాడు.

"నువ్వు లేనన్నాళ్ళూ ఎలా ఉన్నాను?"

"ఆ సంగతి సేరు"

"మళ్ళీ కొన్నాళ్లు అలాగే బ్రతుకు తాను."

ఆమె బ్రతిమాలింది. ప్రాథేయపూర్వకంగా అడిగింది ఉద్దేశం మార్చు కోమని.

"మనుష్యులు చచ్చిపోతుంటే డాక్టరైనవాడు చూస్తూ ఎలా ఊరుకో గలడు?" అన్నాడతను.

"డాక్టర్ల అవసరం యుద్ధభూమిలోనే కాదుగా!" అందామె.

"ప్రతివాడు అలాగే అనుకుంటే ఇహ వెళ్లేవాళ్ళెవరు?"

ఆమె సమాధానం ఏమీ చెప్పలేకపోయింది.

"పోనీ, నా కోసం..." చివరి ప్రయత్నంగా అంది.

"శశీ చదువుకున్న దానివి. నువ్వే అలా అంటే ఎలా?"

"ఇహ ఏమనగలను?"

"నీకంటే నాకు ఎవరున్నారు? కాని విద్యుక్తధర్మం నెరవేర్చవద్దా?"

అతని ఉద్దేశాలు, ఆదర్శాలు ఆమెకి తెలియనివి కావు.

"గాయపడి వైద్యసహాయంకోసం కొన ప్రాణాలతో ఆశగా ఎదురు చూసేవాళ్ళని తలచుకో ఒక్కసారి" శశిరేఖ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ దృశ్యం ఎక్కువసేపు మనసులో నిలుపుకోలేక పోయింది. అంతా తన నేదో అర్థిస్తున్నారు. జాలిగా వేడుకుంటున్నారు. దీనావస్థలోవున్న ఆ నిర్భా గ్యులకోసం తను ఇవ్వగలిగినది ఇవ్వకుండా ఎలా ఉండగలదు.

"రాజా !" ఇహ తను చెప్పగలిగిందేమో లేదన్నట్లు కంపిత స్వరంతో అంది. రాజగోపాలరావు ప్రేమపూర్వకంగా ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

"శశీ మెడిసిన్ చదువుతావా ?"

ఆదర్శప్రాయుడైన తన భర్త అడుగుజాడల్లో నడవటాని కంతకంటే సదవకాశం ఏం ఉంటుంది ?

"ఊరికే కాలం గడపటంకంటె ఏదో పనికివచ్చే చదువు చదవటం మంచిదికదూ !" ఆమె తల ఊపింది.

శశిరేఖని స్వయంగా మెడికల్ కాలేజీలో చేర్పించి వెళ్ళిపోయాడు రాజగోపాలరావు.

తను మెడిసిన్ ప్యాసైతే భర్తకి ఎంతో అండగా ఉంటుంది. ఇద్దరూ కలిసి ప్రాక్టీసు చెయ్యవచ్చు. ఎంతో ఆదర్శప్రాయంగా 'డాక్టర్లంటే అలా ఉండాలి' అని నలుగురూ అనుకునేలా వైద్యవృత్తి చెయ్యవచ్చు. బీదలకోసం ఉచితవైద్యశాల నడపవచ్చు. శశిరేఖ ఎన్నో కలలుకంది. కష్టపడి చదవ సాగింది. సంవత్సరంమీద సంవత్సరం గడిచిపోయింది.

రాజగోపాలరావు రాలేదు. ఏరోజైనారావచ్చు, ఏ క్షణానైనా రావచ్చు. ప్రతిరోజు పోస్టు శశిరేఖకి ఆశాభంగం కలిగిస్తూనేవుంది.

"రాజగోపాలరావు ఇహరాడు ఇహరాడు !" శశిరేఖ ఈ వార్త నమ్మలేదు. నమ్మలేకపోయింది. కాని—అంతా నమ్మారు. పోస్టులో అతని దుస్తులు వస్తే మరి నమ్మక ఏం చెయ్యగలరు ఎవరు మాత్రం ? "ఇహరారా, రాజా ?" దీనంగా బాధగా అడుగుతున్నది రోజూ. సమాధానం ఎవరు చెబుతారు ?

శశిరేఖ మెడిసిన్ ప్యాసయింది. ప్రాక్టీసు చేస్తోంది. 'లేడీ డాక్టర్ శశిరేఖ చాలా మంచిది' అని ఎవరైనా అంటే ఆమెకి వెంటనే తన భర్త జ్ఞాపకం వస్తాడు.

"ఎవరైనా ఆయన తరవాతే"

ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతాయి. తన భర్తనుంచి తను నేర్చుకోవాలిసిందంతా అలా వృథాగా పోవాలిసిందేనా ?

3

ఉదయం ఏడుగంట లయింది.

"రాజా కాఫీ"

"......"

"కాఫీ రాజా"

రెండు కన్నీటి బిందువులు ఆమె కళ్ళనించి జారిపోయి 'రాజా' చేతు ల్లోని పేపరు తడిపాయి.

కొన్ని క్షణాలు అలాగే గడిచిపోయింది. ఆమె ఏవేవో సంగతులు జ్ఞాపకం చేసుకుంటోంది. మబ్బుపట్టిన సూర్యబింబంలా కాంతిహీనమైన ముఖం 'రాజా' బుజంమీద ఆనించి అలాగే వుండిపోయింది.

"శశిరేఖా"

అస్పష్టంగా వినిపించాయి మాటలు.

రాజా పెదవులవైపు చూసింది భ్రమతో. మళ్లీ తల వాల్చుకుంది.

"శశీ"

ఏవేవో భావాలన్నీ అణచుకుంటూ గాద్గదికంగా వినిపించింది ఆ పిలుపు. శశిరేఖ తలెత్తి ద్వారంవైపు చూసింది. సుదీర్ఘ విగ్రహం. దొరటోపీ వుంది. నల్లటి కళ్లద్దాలున్నాయి. పట్టు కుడిచేయి వేళ్ళాడుతోంది. ఎడమ చెంపమీద చెవిదాకా పెద్ద గాయంతగిలి మానిన మచ్చవుంది. ఎవరు?

అతను నల్ల కళ్లద్దాలు తీశాడు.

"శశీ... నేనే నీ..."

"రాజా!"

గుండె ఆగిపోయినట్లు ఒక క్షణం అనుభూతి పొందిందామె.

అతనామెని సమీపించాడు. ఆమె నుంచోలేకపోయింది. నెమ్మదిగా సోఫాలో కూచోబెట్టాడు. ఆమె గుడ్లప్పగించి చూస్తోంది.

"మీరేనా!"

"నేనే శశీ?"

అతనివైపు అలాగే చూడసాగిందామె. తరవాత ఆమెకేమీ కనిపించ లేదు. కన్నీటి తెరలు చూపుని అరికట్టాయి. కళ్లు మూసుకుంది. ఆమె తలను హృదయాని కదుముకున్నాడతను.

పనిమనిషి బకెట్‌తో నీళ్లు తెచ్చి అక్కడ పెట్టబోయి హఠాత్తుగా కొత్తవ్యక్తిని ఆ పరిస్థితిలో చూసి కంగారుపడి, బకెట్ తటాలున వదిలేసి వెనక్కి వెళ్ళిపోయింది. చప్పుడుకి ఇద్దరూ మళ్లీ ఈ లోకంలోకి వచ్చారు. ఆమె ఏదో అడగాలనుకుంది. ఏమడగాలో, ఏది ముందడగాలో ఆమెకి తెలీలేదు.

"జీవితంలో మళ్లీ ఎప్పటికైనా నిన్ను చూడగలుగుతానా అనుకు న్నాను శశీ"

శశిరేఖ మాట్లాడే స్థితిలోలేదు.

"గుండుదెబ్బ తగిలి పడిపోయినప్పుడు కళ్ళన్నీ కమ్మిన చీకట్లో మెరు పులా ఒకసారి నువ్వు మెరిశావు. అదే ఆఖరిసారనుకున్నాను. కనీసం నా శశి ప్రతిబింబమైనా చూశాను. ఇహ ఏమైనా పరవాలేదనుకున్నాను. అదృష్టం బావుండి ఆ దెబ్బకి చచ్చిపోలేదు. ఆ రాత్రి తెల్లవారింది. చుట్టుప్రక్కల ఎవరూలేరు. అప్పటికప్పుడే ఆ ప్రదేశంనుంచి మనవాళ్లు వెళ్ళిపోయారు. అకస్మాత్తుగా జరిగిన ముట్టడికి వాళ్లు తట్టుకోలేకపోయారు కాబోలు. తరవాత ఎన్ని అవస్థలు పడ్డానో దైవానికే తెలుసు. ఖైదీల క్యాంపులో దుర్భర జీవితం గడిపాను. ఎలాగో తప్పించుకున్నాను. యుద్ధం అయిపోయింది. నా సంగతి పట్టించుకున్నవాళ్ళు ఎవరూలేరు. బహుశా చచ్చిపోయాననుకుని ఉంటారు. ఎన్నో అగచాట్లుపడి చివరికి మనదేశం చేరుకున్నాను.

డాక్టర్ రాజగోపాలరావు ఆగాడు. అతని కష్టాలకి ఆమె గుండె తరుక్కుపోతోంది. కాసేపు అదే అవస్థలోవుండి తరువాత అడిగింది.

"వచ్చేటప్పుడు ఉత్తరమైనా వ్రాయలేదేం ?"

రాజగోపాలరావు కొంచెం తటపటాయించి అన్నాడు.

"ఇక్కడి పరిస్థితులు ఎలావున్నాయో నాకు తెలియదు" కదా. స్వయంగావచ్చి పరిశీలించి, వీలునుబట్టి నన్ను తెలియబరుచుకుందామను కున్నాను. అందరూ నేను చచ్చిపోయి ఉంటానని నమ్మివుంటారు"

శశిరేఖ అతన్ని మరింత దగ్గరగా హృదయానికి అదుముకుంది.

"అదేగాక—" అతను ఆగాడు.

ఏమిటన్నట్లు ఆమె అతనివైపు చూసింది.

"నువ్వు ఏ పరిస్థితిలో ఉన్నావో ముందు స్వయంగా చూడటం మంచిదనుకున్నాను. నిజంచెప్పాలంటె" ఆమె మళ్లీ కన్నీళ్లు నింపటంకంటె మరేమీ సమాధానం ఇవ్వలేదు.

"కాని శశీ, మొదట అది విగ్రహం అనుకోలేదు. చప్పున వెనక్కు తగ్గాను. ఇంతలో 'కాఫీరాజా' అని ఆర్ద్రంగా విషాదస్వరం వినిపించింది. శశీ, ఆ పిలుపులో ఏదో అనిర్వచనీయమైన అనుభూతి, మానవహృదయపు లోతుల్ని పరిశోధించి ఏదో నిత్యమైన సత్యాన్ని విన్నట్లుగా, అస్పష్టంగా నా హృదయం అంతటా నిండింది. ఏదో ప్రాణం చూశాను. ఇహ ఆగలేక పోయాను. లేకపోతే అంత అకస్మాత్తుగా కనిపించి ఉండను శశీ"

భావోద్వేగంలో అతను ఇహ మాట్లాడలేకపోయాడు. శశిరేఖకూడా ఏమీ ప్రశ్నలు వెయ్యలేదు. అదే స్థితిలో మౌనంగా ఒకరి ప్రక్కన ఒకరు ఆలోచించలేని మనస్సులతో నిశ్శబ్దంగా ఉండిపోయారు.

౮

తెల్లవారింది ఆ రాత్రి. శశిరేఖ నిద్రలేచింది. ప్రక్కన చూసింది ఎవరూలేరు. సోఫావైపు చూసింది. కిటికీలోంచి వచ్చేగాలికి 'రాజా' చేతిలో పేపరు టపటప కొట్టుకుంటోంది. అంతా కలేనా! శశిరేఖ బరువుగా లేచి సోఫావైపు నడిచింది.

"పేపరు వార్తలేమిటి రాజా?"

1358

రాజా పలకడు.

"ఇది నిన్నటి పేపరు. భలే"

ఆరోజు పేపరుకోసం వెళ్ళబోతుండగా రాజగోపాలరావు ప్రత్యక్షమయాడు గుమ్మందగ్గర.

కలకాదు! ఆమె ముఖంలో సంతోషరేఖలు అలముకున్నాయి.

"పేపరు వార్తలేమిటి రాజా?"

"రాజగోపాలరావు అనే మిలిటరీ డాక్టరు చిన్న చిన్న 'డేమీజీలతో' స్వదేశానికి తిరిగివచ్చాడట" నవ్వుతూ అన్నాడతను. ఆమెకూడా హృదయపూర్వకంగా నవ్వింది. ఆ నవ్వులో గతంలోని బాధా, వర్తమానంలోని సంతోషం మేళవించగా, కొన్ని క్షణాలు ఆమె తన ఉనికినే మర్చిపోయింది.

గాలికి పేపరు టపటప కొట్టుకుంది. ఆ ధ్వనికి శశిరేఖకి చైతన్యం కలిగింది. తటాలున ఆమెకి పేపరుసంగతి జ్ఞాపకం వచ్చింది. రాజావైపు చూసింది ఒకసారి. వెంటనే రాజగోపాలరావు వైపుకి దృష్టి మళ్ళించి, ఒక క్షణం ఆగి గభాలున అతని చేతిలో పేపరు లాగేసి రాజా చేతుల్లో పెట్టింది. అతనామెవైపు ఆశ్చర్యంగా చూశాడు. ప్రత్యుత్తరంగా ఆమె ఒక చిరునవ్వు మాత్రం నవ్వింది.

వంటమనిషి కాఫీ బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది. రాజగోపాలరావు పేపరు చూస్తున్నాడు.

"కాఫీ రాజా"

సప్రేమగా కాఫీకప్పు అందుకున్నాడతను. పెదవులమీద మంద హాసంతో.

శశిరేఖ రాజావైపు చూసింది. మళ్ళీ రాజగోపాలరావువైపు చూసింది. ఏదో తృప్తి ఆమె అనుభవించింది. కాని మళ్ళీ ఏదో భావం మనసులో మెదిలింది.

రాజా—తన రోజూ ఆరాధిస్తున్న రాజాకి కాఫీ అందివ్వలేదు. తన హృదయంలోవున్న రాజా ఎదురుగా వుండగా ఇంకా ఈ విధంగా తను ఎందుకు నొచ్చుకోవాలి? ఆమె నవ్వింది చిన్నగా. కాని సంపూర్ణంగా నవ్వ లేకపోయింది. చెప్పలేని వెలితి ఏదో మిగిలిపోయింది.

"శశీ"

"......"

"ఏమిటాలోచిస్తున్నావు?"

"......"

"కాఫీ చల్లారిపోతోంది"

శశిరేఖకి అతనన్న మాటలేవీ వినపడలేదు. అతనామె బుజాన్ని తట్టాడు. ఉలిక్కిపడ్డది.

"ఏమిటలా చూస్తున్నావు?"

ఆమె పెదవులమీదికి నవ్వు తెచ్చుకుని అంది. "ఏంలేదు కాఫీ తాగు"

అప్రయత్నంగా ఆమె కాఫీ గబగబా త్రాగేసి కప్పు క్రిందపెట్టింది.

"నీళ్ళు అక్కర్లేదుగా అమ్మగారూ?" కప్పులు తీసుకుపోతూ మనిషి అడిగింది.

"ఎందుకక్కర్లేదు?"

మళ్ళీ శశిరేఖ హృదయంలో ఏదో బాధ మెదిలింది. పనిమనిషి మాట్లాడకుండా బకెట్‌లో నీళ్ళు తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. శశిరేఖ తువ్వాలు నీళ్ళలోనుంచి 'రాజా' ముఖం, చేతులూ తుడిచింది. కొత్తపట్టు వేసింది. రాజగోపాలరావు ఇదంతా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఏమిటి శశీ, ఇదంతా ?"

ఆమె రెప్పవేయకుండా 'రాజా' వైపు చూస్తోంది. ఏమీ అనలేదు.

రాజగోపాలరావుకూడా ఆమె చూస్తున్న వైపే చూశాడు, తదేకంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చెయ్యబడ్డ ఆ విగ్రహం మూడుమూర్తుల తనలాగే ఉంది. అకస్మాత్తుగా చూస్తే సజీవమైన మనిషేనని భ్రమకలిగిస్తూవుంది. మొదట రాజగోపాలరావుకూడా అలాగే అనుకున్నాడు పేపరు చూస్తూ, సోఫాలోకూర్చున్నట్టుగా ఉన్న ఆ విగ్రహంచూసి.

ఉన్నట్టుండి రాజగోపాలరావు గట్టిగా నవ్వాడు. కలలోనుంచి తేరుకున్నట్టుగా శశిరేఖ ముఖం భంగిమ పెట్టి అతనివైపు చూసింది, ప్రశ్నార్థకంగా.

"నీ బొమ్మకూడా ఒకటి చేయించి దానివైపు నన్నుకూడా చూస్తూ కూర్చోమంటావా ఏమిటి ?"

శశిరేఖ నవ్వలేదు. అతనివైపు తృప్తిగా తేరిపారచూసి అతని భుజం మీద తల ఆనించి 'రాజా' అని ఆనందాతిరేకంతో కౌగలించుకుంది.

ఎన్నాళ్ళో తపస్సుచేసింది. తన రాజా తనకు తిరిగి లభించాడు. జీవితంలో అంతకంటె కావలసిందేముంది ? అంతకంటె తను కోరే సౌఖ్యం, ఆనందం కోరిక ఏముంటాయి ? అలా ఎప్పుడూ తను అతని భుజంమీద తల ఆనించి ఏ భావనా ప్రపంచంలోనో విహరించకలిగితే చాలు; జీవిత పరమావధి అందుకున్నట్టే. తన రాజా తనని ఇహ విడిచిపోడు, ఇహ తనకి కష్టాలు లేవు. విషాదం తననించి దూరమైపోయింది. అనంతమైన ఆనందం అనిర్వచనీయమైన ఆనందానుభూతి ఇహనించి తనదే. శశిరేఖ మురిసిపోయింది సంతోషంతో హృదయం నిండిపోయింది. కాని కాని, ఏమూలో ఎక్కడో— ఏదో వెలితి. ఏదో తననించి అస్పష్టంగా, కాని నిజంగా దూరమై, సుదూరమై పోతూన్నట్టు మనస్సులో మారుమూల ఛాయామాత్రంగా అనిపించింది.

౫

"ఈవాళ ఓ ఆపరేషన్ చాల నేర్పుగా చేశాను, రాజా."

రాజగోపాలరావు గర్వంగా వింటున్నాడు.

"మొదట భయపడ్డాను. కాని చాల జయప్రదంగా చేశాను."

"నా శశి గొప్ప డాక్టరై పోతోందన్న మాట."

"ఎంతగొప్ప డాక్టరైనా నా రాజా తరవాతే."

"శశీ." అనురాగంతో నిండిన హృదయంతో ఆమె కళ్ళలోకి చూశాడు రాజగోపాలరావు.

అకస్మాత్తుగా శశి 'రాజా' వైపు చూసింది, ఆమె ముఖంలోని సంతోష చిహ్నాలు నెమ్మదిగా అంతరించాయి. అలాగే ఆ విగ్రహంవైపు చూస్తూ నుంచుంది. తను 'రాజా' తో ఇప్పుడు అసలు మాట్లాడటంలేదు. ఆమె హృదయంలో ఏదో బాధ ఆమెని కలచివేసింది. తన 'రాజా'ని తను నిర్లక్ష్యం చేస్తోంది. ఒక్క మాటకూడా మాట్లాడటంలేదు. బాధగా అన్నది. "రాజా!" ఈ పరిస్థితి అర్థంకాక రాజగోపాలరావు తికమకపడ్డాడు.

"శశీ!" ఆమె పలకలేదు. మళ్ళీ పిల్చాడు. భుజం తట్టాడు.

"అలా ఐపోయావేం ?"

శశిరేఖ అతనివైపు చూసింది. క్రమంగా ఆమె ముఖం వికసించింది. తన 'రాజా' అక్కడే, తన ఎదురుగానే ఉన్నాడు. ఏమిటి తన పిచ్చి భ్రమ— దౌర్బల్యం! తన రాజాని ఏమాత్రం నిర్లక్ష్యంగా చూడటంలేదు. ఎంతో ప్రాణంగా చూసుకుంటోంది. ఆమె నవ్వగా అతను ముఖంలోకి చూసింది. తొలగిపోయిన ఆనందం మళ్ళీ ఆమెని ఆశ్రయించింది. కాని ఆ ఆనందం వెనకాల, దూరంగా, లీలగా, పోగొట్టుకున్న వస్తువేదో పోతే కలిగే అనుభూతి లాంటిది తన ఉనికిని తెలియచేస్తోంది. రాను రాను శశిరేఖకి ఇదో సమస్యగా పరిణమించింది. ఉన్నట్టుండి 'రాజా' విగ్రహం జ్ఞాపకంవొస్తుంది. మళ్ళీ తన రాజాని తలుచుకొని తృప్తిపడేది. ఏదో వెలితి మాత్రం లీలగా గోచరిస్తూనే ఉంటుంది.

ఈ పరిస్థితి చాలాసార్లు గమనించాడు రాజగోపాలరావు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చెయ్యబడిన ఆ విగ్రహం చూస్తున్న కొద్దీ మానసికంగా అతనికేదో బాధకలిగేది. నిండైన ఆ విగ్రహం పూర్తిగా తనపోలికే. తను పూర్వం యుద్ధంలోకి వెళ్ళకముందు అలాగే ఉండేవాడు. కాని ఇప్పుడు? రాజగోపాలరావు ఇహ ముందు ఆలోచించలేకపోయాడు. ఆ ఆలోచనే అతనికి భయంకలిగిస్తుంది. తను కుడిచెయ్యిలేని డాక్టర్. ముఖంమీద వికృతంగా పెద్దమచ్చ. బండబారిన ముఖం కాని తను, ఎలా ఉంటేనేం? తన శశికి తనమీద ఎంతో మక్కువ, అయినా శశి ఆ విగ్రహంవైపు అలా చూస్తుంటే, దాన్ని అంత శ్రద్ధగా రోజూ శుభ్రంగా ఉంచటానికి పాటుపడుతుంటే అతనికేదో అయిష్టత గూడుకట్టుకుని ఎక్కువ కాసాగింది. తను పక్కనే ఉండగా ఇంకా ఆ విగ్రహం గురించి అంత బాధెందుకని ఎన్నోసార్లు అడిగాడు. పరోక్షంగా, దాన్ని మరోచోటికి మరలించమని సూచించాడు. కాని శశి ఒప్పుకోలేదు. ఎక్కువగా ఆ విషయం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంటుందని ఊరుకున్నాడు.

శశి ఆరోగ్యం విషయం అతనికి కొంచెం ఆందోళన కలిగించింది. ఆమె ఏదో మనసులో బాధపడుతున్నట్టుగా అతనికి కొన్నాళ్ళనుంచీ అనుమానం కలిగింది. ఆ ఉదయం కాఫీ తాగుతుంటే అడిగాడు కారణం. ఆమె నవ్వి ఏమీ లేదన్నది.

"అలా రోజు రోజుకీ తగ్గిపోతూ ఏమీ లేదంటావేం?"

శశి తనవైపు ఒకసారి చూసింది.

"నేనేం తగ్గాను?"

రాజగోపాలరావు సూటిగా అన్నాడు.

"నిజంగా అడుగుతున్నాను శశీ. నీ మనసులో బాధేమిటో నాకు చెప్పకూడదా?"

అతని వ్యథచూసి ఆమె బాధపడ్డది. ఏం చెబుతుంది? తనకేం తెలుసు? రాజావైపు చూసింది. మళ్ళీ రాజగోపాలరావువైపు చూసింది. మళ్ళీ విగ్రహం వైపు చూసింది. మనసులో ఏ ఏ ప్రశ్నలకో ఏవేవో సమాధానాలు చెప్పుకుంది. ఏదో తెలియని వేదన-అశాంతి తృప్తి. మళ్ళీ అశాంతి. "రాజా!" ఆమె అతని భుజంమీద తల ఆనించి కళ్ళు మూసుకుంది. తెలియనిదేదో తెలుసుకోవాలనే వేదన భరించలేకుండా ఉంది. తనకేమీ తక్కువ కాలేదు. కోరిక

లేమీ లేవు. అయినా మనసుకి కావలసిన ప్రశాంతత తనకి ఎందుకు కొరవడింది ? ఒక్కసారి ఏడవాలనివుంది. ఎందుకు ? ఏమో ! కాని తను ఏడవలేదు. ఏడుపురాదు. ఆ పాడురోజులు పారిపోయాయి. తనకి జీవితంలో కావలసినంత సౌఖ్యం. తన రాజా, తన జీవన సుధాంశు తన ప్రక్కనే ఉన్నాడు. ఆమె అతన్ని గట్టిగా కౌగలించుకుంది.

అతను ఆలోచించి బుర్ర బద్దలుకొట్టుకుంటున్నాడు. ఏమిటి, తన శశికి ఏంకావాలి ? అలా తనవైపూ, విగ్రహంవైపూ ఎందుకు చూస్తుంది ? చూసి ఎందుకు బాధపడుతుంది ? ఆమె మనోవ్యధకి కారణం ఇందులోనేఉందా? రాజగోపాలరావుకి బాధాకరమైన ఆలోచన తట్టింది. కాని... కా...అసంభవం.

"శశీ" ఆప్యాయంగా పిలిచాడు. ఆమె వినేస్థితిలోలేదు. మళ్ళీ పిలిచాడు. సమాధానంలేదు. అతని మనసు ఆలోచిస్తూనే ఉన్నది. సమాధానం కోసం వెతుకుతూనే వుంది. రోజంతా ఆలోచిస్తూనేవున్నాడు. రాత్రి పడుకున్నా మనసు మాత్రం మెలకువగానే వున్నది. ఎప్పుడో కునుకుపట్టింది. కలతనిద్రలో లేచాడు.

"శశీ"

సమాధానంలేదు. ప్రక్కన చూశాడు. ఆమె లేదు. అతని గుండె గతుక్కుమంది. సోఫావైపుకు చూశాడు. ఆ మసక వెలుతురులో అస్పష్టంగా కనిపించింది. విగ్రహం భుజం ఆనుకుని శశిరేఖ భావనా ప్రపంచంలో వుంది.

"శశీ"

ఆమె పలికే స్థితిలోలేదు. ఏదో ఆలోచిస్తోంది. హృదయంలో ఏదో బలీయంగా ఆమెని బాధిస్తోంది. 'రాజా' దగ్గర సోఫాలో కూర్చుంది. విగ్రహం బుజంమీద తల ఆనించింది. ఏదో అనుభూతి దగ్గరౌతూ, మళ్లీ దూరంగా పోతూ ఆమెని వేధిస్తోంది. ఆమెకి ఏడవాలనిపించింది. కాని కన్నీరు రాదు. విగ్రహం ముఖంలోకి చూస్తూంది. రాజా అంటుంది. 'మీతో మాట్లాడటం లేదని కోపమా రాజా' అంటుంది. బరువు తీరిపోయేలా ఒక్కసారి దుఃఖం పొంగిపొర్లితే బావుండుననిపిస్తుంది. కాని తనకేంలోటు ? తనకంటే సౌందర్యవంతురాలు ఎవరు ? మనరాజా ఇహలోకాని విడిచి వెళ్ళిపోయాడు. తనకేం కష్టాలులేవు. జీవితాంతం సుఖంగా గడపవచ్చు. కాని...భర్తప్రక్కన ఉండగా ఇంకాతనికీ విగ్రహంమీద ఈ ఆపేక్షఎందుకు ? ఇన్నేళ్ళ సావాసమా ?

రాజగోపాలరావు లేచివచ్చి నెమ్మదిగా ఆమె భుజంతట్టాడు. ఉలిక్కిపడ్డది. దగ్గరికి తీసుకున్నాడు. అతని భుజంమీద తలఆనించి అలాగే కూర్చుండిపోయింది ఆమె. అతను బుజ్జగించి అడిగాడు.

"శశీ నాకు చెప్పవా నీ బాధ ?"

ఏం చెబుతుంది ? ఏదో చెప్తే బావుండుననిపించిందామెకి. అతని వేదనచూసి. కాని ఏం చెబుతుంది ?

"నాకు చెయ్యిలేదనా ?"

"కాదు రాజా కానేకాదు" అందామనుకుంది. నోటిదాకా వచ్చింది. కాని ఏదో కారణం చెప్పకపోతే తన రాజా ఎంతో మథనపడతాడు. అందుచేత మాట్లాడకుండా ఊరుకుంది. అతను మళ్ళీ అడిగాడు. "ఊఁ" అనలేకపోయింది. అతన్ని దగ్గరగా తీసుకుంది. "అంతేనా ?" అన్నాడు. ఇంకా మౌనమే. అతనిగుండె గట్టిగా కొట్టుకుంది. మనసు మనసులోలేదు. తలలో రైళ్లు పరుగెత్తుతున్నాయి. కాని ఆమె కిదేమీలేదు. రాజగోపాలరావు కొద్ది క్షణాలకి సర్దుకున్నాడు. అవును. స్పష్టంగా కనిపించే విషయం కనిపెట్టటానికి తనకిన్నాళ్లు పట్టింది. ఆమె విగ్రహం వైపూ, తన వైపూ చూడటంలో అర్థమేమిటి ? ఆ విగ్రహానికి ఉన్నదేదో తనకి లోపించింది. ఏం లోపించింది ? హుఁ. తనకంటె గుడ్డివాడు ఈ ప్రపంచంలో ఇంకెవరూ లేరు. ఈ స్వల్ప విషయానికి బుర్ర బద్దలుకొట్టుకున్నాడు. ఆ మసక వెలుతురులో శశిరేఖ ముఖంలోకి చూశాడు. ఆమె కళ్లు మూసుకొని ఉంది. మనసులో పిలిచాడు. "శశీ !" అతని కళ్ళలో నీళ్లు తిరిగాయి.

౬

మధ్యాహ్నం భోజనంచేసి వెళ్ళిన కెప్టెన్ రాజగోపాలరావు సాయంత్రమైనా తిరిగి రాకపోవటంచూసి ఆశ్చర్యపడ్డది శశిరేఖ. కాని ఆరాత్రి కూడా అతని దర్శనంకాదని ఆమె కలలోకూడా అనుకోలేదు. అమితంగా గాభరాపడ్డది. తెలిసినచోట్లకి వెళ్ళి చూసింది. కాని జాడలేదు.

మర్నాడు రాజా షర్టు మారుస్తుంటే జేబులో ఏదో కాగితం కనిపించింది. తీసి చదివింది శశిరేఖ ఎడంచేతి దస్తూరీ.

"ప్రియమైన శశీ !"

రాత్రంతా గాభరాపడ్డావా? కన్నీరు విడవటంకంటె ఏంచెయ్యగలను? నేను నీ ఎదురుగా వున్నంతకాలం నీకు శాంతి వుండదు. నాకు తెలుసు. నీ మనోవేదన నీ ప్రియమైన రాజా కుడిచెయ్యి పోగొట్టుకుని, వికారి అయి ఏమీ చెయ్యలేక జీవచ్ఛవంగా బ్రతకటం నువ్వు సహించలేవు. ఒకనాడు ప్రఖ్యాతివహించిన సర్జన్ నేడు పనికిమాలినవాడను. శశి, ఇలా జీవించటం నాకూ దుర్భరంగానే వుంది. అసలు తిరిగి రాకుండా ఉండవలసింది. ఒక్క ఆకర్షణా నువ్వే శశీ! నిన్ను చూశాను. చాలు. నేను ఉన్నంతకాలం నీకు మనశ్శాంతి ఉండదు. నువ్వుకూడా నా కళ్ళముందే, నేను చూస్తూ ఉండగానే జీవచ్ఛవంలా ఐపోయి, నిరంతర వేదనతో ఎందుకూ కొరగాకుండా పోవటం ఎలా సహించగలను?

శశీ, పరలోకం ఏదైనా వుంటే మనం తప్పకుండా కలుసుకుంటాం అక్కడ. అందాకా ఎక్కడో—

నీ రాజా.

ఉత్తరం ఎలా పూర్తిచేసిందో తెలియదు; శశిరేఖ రాజామీద రెండు చేతులూవేసి తల బుజంమీద ఆనించి భోరున ఏడ్చింది. కన్నీరు ఎడతెగకుండా ప్రవహిస్తూ రాజాని తడిపేస్తోంది.

రాజా ఇహ రాడు.

ఆమె కుమిలి కుమిలి ఏడ్చింది.

"ఇదేనా రాజా మీరు అర్థంచేసుకున్నది?"

ఎన్నో వందలసార్లు అడిగింది.

రాజా పలకడు కన్నెత్తి చూడడు.

దుఃఖం ఆమె గుండె చీల్చుకుని నదీప్రవాహంలా ప్రవహించసాగింది. ఆ ప్రవాహంలో వ్యథలూ, బాధలూ అన్నీ కొట్టుకుపోయాయి. అపారమైన అనిర్వచనీయమైన శోకం ఏదో గీతిక ఆలాపించగా, శశిరేఖ కన్నీటి కెరటాల మీద తేలిపోతోంది. ఎక్కడికో, ఏ సీమలోకో, ఆ రసరంగ మృదంగవాద్యం వింటూ తన్మయావస్థలోకి ప్రయాణిస్తున్న శశిరేఖ మనసులో కనిపించింది మారుమూల, ఛాయామాత్రంగా-క్రమంగా-స్పష్టంగా-తననించి దూరమైనదేదో తన దగ్గిరికి వస్తోంది క్రమంగా, నిజంగా.